# నాన్నా! ఎప్పుడొస్తావ్?

గున్నమ్మ ఉలిక్కిపడి లేచింది. ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. ఆకాశంలో చంద్రుడు నీరసంగా వెలుగుతున్నాడు. చలిచలిగా వుంది. గున్నమ్మ నాలుగు వైపులా చూసింది. కొంచెం భయం వేసింది. చుట్టూ ఎవరూ లేరు. తల పైకెత్తి చూస్తే నిటారుగా నిశ్శబ్దంగా దేవుని సాన్నిధ్యానికి దారి చూపుతున్నట్లు గుడివైపు మెట్లు పరచి వున్నాయి. ఆ మెట్లు గున్నమ్మకి కొత్తేమీకాదు. ఆమె రోజుకి పాతిక ముప్పయిసార్లు ఎక్కి దిగుతుంది. వచ్చిన భక్తులు ఎంతో ఆయాసపడుతూ ఎక్కుతారు. కాని గున్నమ్మ ప్రాకడం, నడవటం ఆ మెట్లమీదే నేర్చుకుంది. పధ్నాలుగు సంవత్సరాల ఆమె జీవితం అంతా ఆ మెట్లమీదే గడిచింది. దూరంగా కనిపించే పూరిగుడిసె యిల్లుగా వున్నా. గున్నమ్మకి ఆ దేవుడి కొండే యిల్లు -

గున్నమ్మ లేచి నిలబడింది. పరికిణీ దులుపుకుంది. కనిపించే కోనేటి వైపు అడుగులు వేసింది. కొంచెంగా వెలుగు అన్నివైపులా అలుముకుంటోంది. గున్నమ్మ ముఖం, కాళ్ళూ, చేతులు కడుక్కుంది. వొళ్ళంతా నొప్పులుగా వుంది. ఆకలితో కడుపు నకనకలాడుతోంది రాత్రి కూడా ఏమీ తినలేదు. ఆమె మళ్ళీ వచ్చి గుడి మెట్లమీద కూర్చుంది. ఆమె రోజూ దేవుణ్ణి దర్శించడానికి వచ్చినవారి కందరికీ సహాయం చేస్తుంది. ముఖ్యంగా వారి పిల్లల్ని పైదాకా ఎత్తుకుని, జాగ్రత్తగా మోసుకెళ్తుంది. మధ్యలో వాళ్ళు ఏడిస్తే కథలూ, కబుర్లు చెప్పుతుంది. గుడి దగ్గరికి చేర్చివాళ్ళు యిచ్చే డబ్బులు తీసుకుంటుంది. అలా రోజుకి ఎన్నిసార్లు ఆ మెట్లమీద తారట్లాడుతుందో లెక్కలేదు. క్రిందనుండి పిల్లల్ని పైకి తీసుకెళ్ళడం అందువల్ల వచ్చే డబ్బుతో జీవనాన్ని గడపడం ఆమెకి దినచర్య. కేవలం డబ్బులకోసం గున్నమ్మ పిల్లల్ని ఎత్తుకోదు. ఆమె అలా చంటి పిల్లల్ని ఎత్తుకోవడంలో గొప్ప ఆనందాన్ని అనుభవిస్తూ వుంటుంది. ఏవో తెలియని తీరని ఆమె కోరికలు తీరుతున్నట్లు ఆమె అనుభూతి పొందుతుంది.

గున్నమ్మ జడలో వెలిసిపోయిన రిబ్బను ముక్కను చటుక్కున లాగేసి, నోట్లో పెట్టుకుని చేతివేళ్ళతో చెంపల మీద జుట్టు సర్దుకుని, నాలుగే అంగుళాలు పొడవున్న జడను గట్టిగా అల్లుతోంది. పళ్ళమధ్య రిబ్బను గాలికి రెపరెపలాడు

తోంది. ఆమె అటూ యిటూ చూస్తోంది. దూరంగా నలుగురు పిల్లలతో చంకలో చంటిపిల్లతో వగరుస్తూ వస్తున్న ఆ తల్లిని చూడగానే గున్నమ్మ మనసు ఆనందంతో ఉరకలు వేసింది. చకచకా రిబ్బను కట్టేసి ఒక్క పరుగులో ఆ కుటుంబాన్ని చేరుకుంది. ఆ ఇల్లాలు ఏదో సణుగుతోంది. మిగిలిన పిల్లలు చక్కగా రంగు రంగుల గౌనులు, చొక్కాలు వేసుకుని ముద్దుగా వున్నారు. వారిని చూడగానే వాళ్ళతో బాటు మెట్లన్నీ ఎక్కుతూ, కబుర్లు చెపుతూ పైకి వెళ్ళాలనిపించింది. వారు మెట్లువైపు పరుగెడుతుంటే తల్లి వారిని కేకలేస్తోంది.

"అమ్మగారూ! పాపని నే నెత్తుకొని పైకి తీసుకొస్తాను" అంటూ ఆమెకి దగ్గరగా వచ్చింది. ఆ యిల్లాలు అనుమానంగా గున్నమ్మ కేసి చూసి, ఇదేమిటీ అన్నట్లు భర్త కేసి చూసింది.

"అవును సుబ్బలక్ష్మీ! పోనీ ఎత్తుకొని తీసుకురానీ - కొంచెం డబ్బులిద్దాం" అన్నాడు ఆమె భర్త రామారావు.

సుబ్బలక్ష్మి ఏమనుకుందో వెంటనే పసిదాన్ని గున్నమ్మ చేతుల్లోకి అందించబోయింది. ఆ పిల్లకి ఎలా అర్థమైందో ఏమో ఒక్కసారి కెవ్వుమని తల్లిని రెండుచేతులతో గట్టిగా కరచి పెట్టుకుపోయింది. ఆమె ఎలాగైనా వదిలించి ఆ పిల్లని గున్నమ్మకి యివ్వాలని విశ్వప్రయత్నం చేసింది. కాని ఆ పిల్ల ఒక్కలాగా ఏడవడం మొదలుపెట్టింది. గున్నమ్మకి చాల నిరాశ కలిగింది. ఏలాగైనా యీ పసిపిల్లని ఎత్తుకోవాలని తల్లి చేతుల్లోంచి లాక్కుని రెండు మెట్లె

క్కింది. ఇంతలో ఆ పిల్ల గట్టిగా ఏడ్చి, గుక్కపట్టేసి, నల్లగా అయిపోయింది. గున్నమ్మ నరాల్లో భయం చర్రున పాకింది. కాళ్ళు చేతులు దడదడలాడాయి. ఏం చెయ్యాలో తోచలేదు. ఇంతలో సుబ్బలక్ష్మి గున్నమ్మ చేతిలో పిల్లని తీసుకొని అక్కడే చతికిలపడింది. పిల్ల చెవులు గట్టిగా మూసింది. గున్నమ్మ భయంగా చూస్తూ పక్కగా నిలబడింది. చంటిపిల్ల మెల్లగా తేరుకుంది పిల్ల విషయం పూర్తిగా తెలిసిన తల్లి గున్నమ్మని ఏమీ అనలేదు సరికదా.

"చంపుకు తినడానికి పుడతారు పిల్లలు ఏం రోగం ? ఆ పిల్ల కాస్త ఎత్తుకుని పైకి తీసుకువస్తానంటే పోనీ అనుకున్నాను. ఈ దయ్యం వెళ్తేకదా !" అంటూ చంటిదాన్ని చంక వేసుకుంది. రామారావు గున్నమ్మ చేతిలో ఒక పావలా పెట్టి, ఎడపిల్లాడి చెయ్యి పట్టుకుని మెట్లు ఎక్కడం మొదలు పెట్టాడు, గున్నమ్మ అక్కడే నిలబడిపోయింది. కష్టపడి వగరుస్తూ కొండ ఎక్కుతున్నది ఆ తల్లిని చూసి నిట్టూర్చింది. చేతిలో పావలాబిళ్ళ చెమటకి తడిసిపోయింది. సూర్యుడు చర్రున ఎండ కురిపిస్తున్నాడు. గున్నమ్మ మళ్ళీ ఎవరు కనబడతారా అని చూడ్డం మొదలుపెట్టింది. దూరంగా కోనేటి దగ్గరకెళ్ళి కడుపునిండా మంచినీళ్ళు త్రాగి వచ్చింది. అటూ యిటూ దిక్కులు చూస్తూ నిలబడింది. ఈ రోజు ఎందుకో ఎక్కువమంది జనం రావడం లేదు అనుకుని నిరాశ చెందింది గున్నమ్మ కాసేపు. పావలాపెట్టి శనక్కాయలు కొనుక్కుని తినడం మొదలుపెట్టింది. ఇంటికి పోయి అన్నం తిందామంటే

మనసెలాగో వుంది. చేతిలో డబ్బుల్లేవు. డబ్బులు లేకుండా యింటికి వెళ్తే పైడమ్మ అనే మాటలు గున్నమ్మకి కొత్తేమీ కాదు. అయినా ఆ మాటలు పడటం ఆమెకి పాత పుండును రేపినట్లుగా అనిపిస్తుంది. ఎప్పుడో ఒకప్పుడు రెక్కలు విప్పుకుని ఎగిరిపోయే రోజు వస్తుందని గున్నమ్మ విశ్వాసం. ఆరోజు కోసం ఆమె అలా ఎన్నినాళ్ళగానో ఎదురు చూస్తూనే వుంది.

మళ్ళీ దూరంగా ఎవరో యిద్దరు భార్యాభర్తలు వస్తున్నారు. ఆమె చేతిలో పాప వుంది. గున్నమ్మ వాళ్ళ వైపు పరుగుతీసింది.

"అమ్మా! పాపని నే నెత్తుకుని తీసుకొస్తాను పై దాక. మీకు కష్టం లేకుండా వుంటుంది" అంది ఆశగా.

"ఏమీ అవసరం లేదు. నాకేమీ బరువు కాదు. అయినా పాప అంటా వేమిటి ? బాబు" అంది ఆ యిల్లాలు గర్వంగా. ఆమె కళ్ళల్లో ఆడపిల్లని కనడంలో వుండే అసహ్యం దురదృష్టం కనిపించింది. మగపిల్లాడిని మొదటిసారి కన్నందుకు గర్వం మెరిసింది. ఇవేమీ అర్థంకాని గున్నమ్మకి పాప అనడంలో తప్పు తెలియలేదుగాని అమ్మగారు బాబు అంటే సరేననుకుంది. ఆమె ముందుకు కదులుతోంది. ఇంక వుండబట్టలేక గున్నమ్మ మళ్ళీ

"అమ్మగారూ! చాలా మెట్లున్నాయి. మీరు బాబుతో ఎక్కలేరు. నే జాగ్రత్తగా ఎత్తుకుని తీసుకొస్తాను. ఇవ్వండమ్మగారూ" అన్నది.

"పోనీ సుశీ: యిస్తావా" అన్నాడు ప్రక్కనే వున్న ఆయన. "శుష్క దండుగ. ఎందుకూ! నేను కాన్వెంటు-. మీరు కాన్వెంటు ఎత్తుకుంటే సరిపోతుంది - అయినా నేనే ఎత్తుకో గలను" అంది సుశీ వయ్యారంగా.

తా - తా - తా - అంటూ కుర్రాడు గున్నమ్మని చూసి నోరంతా తెరిచి నవ్వాడు. చేతులు చాచి మీద కొరిగి పోయాడు. గున్నమ్మ మురిసిపోయింది. ఎత్తుకోవాలని ఎంతగానో అనిపించింది. ఆ సుశీ మాత్రం పిల్లాడిని వెనక్కి లాగి

"ఏయ్ నీకాక్కాదు వద్దంటుంటే. ఫో అవతలకి" అంటూ గట్టిగా అరచింది. గున్నమ్మ మనసు చివుక్కుమంది. మరింక అడుగు ముందుకు వేయలేకపోయింది. దూరంగా బాబు నవ్వుతూ అమ్మ చంకలో కూర్చుని దర్జాగా వెళ్ళి పోతున్నాడు.

నిరాశగా. విసుగ్గా అక్కడే పెద్ద మెట్టుమీద కూర్చుంది గున్నమ్మ. ఎక్కడినుంచో చెట్లు చల్లనిగాలి మోసుకొస్తున్నాయ్. నీరసంగా వుండి నిద్రవస్తున్నట్లు వుంది. పై నుండి వచ్చే అడుగుల చప్పుడికి గున్నమ్మ ఉలిక్కిపడి

చూసింది. గుడి పూజారి చేతిలో పళ్ళెంతో చకచకా గున్నమ్మని దాటిపోబోయి ఆగాడు.

"ఏమే గున్నీ ఈ వేళ పైకి రాలేదేవిఁటే" అంటూ యింత ప్రసాదం ఆమె చేతిలో వేశాడు. ఆకలిగావున్న గున్నమ్మ దాన్ని ఆప్యాయంగా తినేసింది. ఆకలి తీరినట్లుగా అనిపించింది. పూజారి మళ్ళీ గుడి తలుపులు తీసేవరకు తనేం చెయ్యాలి. ఎవరూ పైకి వచ్చేవారు లేరు, గున్నమ్మ చిన్నగా కునుకుతూ కూర్చుంది. ఇంటికి వెళ్తే డబ్బుల్లేవని పైడమ్మ కేకలేస్తుంది. ఇంతలో వీరయ్య రానే వచ్చాడు.

"ఒసే గున్నీ ! నిన్ను రమ్మంటోంది" అంటూ తుర్రు మన్నాడు.

గున్నమ్మకి యింటికి వెళ్ళాలనిపించలేదు. ఆమె మనసు ఆతృతతో నిండివుంది. ఈ కొండమీదకి వచ్చేవారిలో ఎవరైనా తన తండ్రీ కావచ్చు. తల్లీ....తండ్రీ, అక్క, తమ్ముడు, మరొక చిట్టి తమ్ముడు, అలా అందరూ వుండాలని వుంటుంది గున్నమ్మకి. తను బుజ్జి తమ్ముణ్ని ఎత్తుకుని తిరగాలని అనిపిస్తుంది. తన చేతులలో తమ్ముడు ఆడుకోవాలని ఆమె ఎప్పుడూ కోరుకుంటుంది. ఇదే ఊహ గున్నమ్మలో పెరుగుతూ వుంటోంది. అందుకే ఆమె ఏ తల్లి పిల్లల్ని మెత్తుకుని మొక్కబోయినా తను వెంటపడి మరీ పిల్లల్ని ఎత్తుకుంటుంది. అలా కుటుంబంతో దేవుడి గుడికి వెళుతుంటే గున్నమ్మకి ఏదో తెలియని ఆనందం కలుగుతుంది. పిల్లల

స్పర్శలో అనిర్వచనీయమైన అనుభూతి పొందుతుంది. వాళ్ళతో వుంటే ఆ తల్లీ - తండ్రీ పెట్టిన ప్రసాదంతో కడుపు నిండిపోతుంది. గున్నమ్మ యిలా గడిపే జీవితంలో ఒకటే ఆలోచన. అదే నాన్న గురించి, నాన్న వస్తాడు - వస్తాడు తనకోసం వస్తాడు. ఒకరోజు తనకోసం వచ్చి తనని ఆదరిస్తాడు, యిదే ఆమె నిరంతరం ధ్యానించే విషయం.

దూరంగా ఇందాక గుడిలోకి వెళ్ళిన సుబ్బలక్ష్మి. రామారావు పిల్లలతో దిగుతున్నారు. గున్నమ్మ లేచింది ఇందాక గుక్కపట్టి ఏడ్చిన పసిపిల్ల తల్లి చంకలో కూర్చుని వెనుకవస్తున్న అన్నయ్యని చూసి నవ్వుతోంది. అయిదేళ్ళ ఆ కుర్రాడు అమ్మ చంకలో చెల్లాయిని కవ్విస్తున్నాడు. గున్నమ్మకి యెలాగైనా ఆ పాపని యెత్తుకోవాలని అని పించింది. ఆ యిల్లాలు పిల్లలతో మండపంలో కూర్చుంది. పిల్లలు కొబ్బరి చిప్పలుకొట్టి పెట్టమని తండ్రిని గలాటా చేస్తున్నారు. దూరంగా నిలబడి వారినే తదేకంగా చూస్తోంది గున్నమ్మ.

"నాన్నా ! నాకు ముందు పెట్టు -"

నాన్నా నాకో మరి !

నా కింత చిన్నదైతే అసలు వద్దే వద్దు -!

ఆయన అందరికి ఏలాగో సర్దిచెప్పి కొబ్బరి ముక్కలు యిచ్చి, దూరంగా వున్న గున్నమ్మని పిలిచి ఒక ముక్క, ఒక అరటిపండు యిచ్చాడు. ఆమె భక్తిగా తీసుకుంది. రామారావు ముఖంలోకి చూస్తూ వుండిపోయింది గున్నమ్మ.

సుబ్బలక్ష్మి -

"ఏమే పిల్లా నీ పేరేమిటి?" అంది చంటిపిల్ల బ్రాయరు వూడదీస్తూ.

"నా పేరు గున్నమ్మండి."

"మీ యిల్లు ?"

"ఇదే నా యిల్లండి."

"మీ అమ్మా నాన్నా యిక్కడే వుంటారా ?"

"మా అమ్మా నాన్నా యీ కొండమీద వున్న దేవుడేనండి" ఆమె కంఠం వణికింది. రామారావు ఉత్సాహంతో ముందుకు వంగి

"అంటే అసలు తల్లీ తండ్రీ లేరా ?" అన్నాడు.

"అసలు తల్లీ తండ్రీ లేకుండా యెవరుంటారండీ ?" దీర్ఘంతీస్తూ నవ్వింది గున్నమ్మ.

"ఓసి నీ చమత్కారం కూలా - అంటే తల్లీ తండ్రీ యిప్పుడున్నారా అని !" అన్నాడు.

"ఉన్నారండీ, యెక్కడో !"

"మరి నువ్వెందు కిక్కడున్నావ్ ?"

"ఇక్కడ వదిలేశారండి. ఉండకేం చెయ్యనండి ?"

"మరి అన్నం ?"

"మా పెద్దమ్మ పెడుతుంది - అయినా యెప్పుడో నాడు మా నాన్న రాకపోతాడేంటండీ - నన్ను చూడక పోతాడేంటండీ - ఆ రోజు వస్తుందండి"

"ఓసినీ! ఎంత తెలివే నీకు? నువ్విక్కడ వున్నట్లు తెలుసా మీ నాన్నకి?"

"తెలిస్తే ఇంక గొడవేముందండి! అసలు నే నెప్పుడూ మా నాన్ననీ, అమ్మనీ చూడలేదండి -"

"అయితే ఎవరు చెప్పారు నీకు"

"మా పైడమ్మ చెప్పిందండి." మా నాన్న చాల గొప్పోడటండి. గొప్ప కులం గలవాడంట అలాంటి వాడు రాకుండా వుంటాడేంటండీ-" ఆ పిల్ల కళ్ళల్లో మెరిసే విశ్వాసం చూసి సుబ్బలక్ష్మి చలించిపోయింది. చూస్తే జాలేస్తోంది. పిల్ల చిన్నదైనా ఊహలు చాలా పెద్దవి అనిపించింది.

"పైడమ్మ నిన్ను పెంచింది కదా నువ్వు రోజూ ఏదైనా పనిచేసి డబ్బులు సంపాదించాలిగాని వూరికే యిలా తిరిగితే ఎలా మరి" అన్నాడు రామారావు.

"అలా అని నేను పాచిపనులు అవీ చేస్తే రేపు నాన్న వచ్చి నన్ను చూసి ఎంత బాధపడతాడండి! అలాంటి తక్కువ పనులుచేసి మా నాన్నని బాధపెట్టనండి. ఆయన గొప్పింటి వోడు, ఆయన గౌరవం నేను చూడొద్దాండీ - మీరే సెప్పండి....నాకు తెలుసండి, ఈ వేళ కాకపోతే రేపు వస్తాడండి. మా నాన్న రాకమానడు. ఏమో ఏ వేళ వచ్చినా రావచ్చు. తీరా వచ్చినప్పుడు నే నెక్కడో వుంటే ఎలాగండి?

పిల్లలు నిశ్శబ్దంగా గున్నమ్మనే చూస్తున్నారు. వాళ్ళ కేమీ అర్థంకాలేదు. ఒక్కటే తెలిసింది వాళ్ళకి. గున్నమ్మకి నాన్న లేడనీ.

"పోనీ మీ అమ్మ రాదుటే నీకోసం" అంది సుబ్బలక్ష్మి వుండబట్టలేక.

"రాదండీ" ఆవిడ మరొకణ్ని మనువాడిందిగా. ఆడు రానివ్వాలి కదండి, నాన్నంటే మగాడు, ఆయనిష్టం వచ్చినట్లు వుంటాడు. అందుకే నా కోసం వస్తాడు. అదే నా నమ్మకం" అంది గున్నమ్మ.

"ఓసి భడవా ! నీకెంత తెలివే పిల్లా !"

ఆ చిన్నారి మనసులో తండ్రికోసం వున్న ఆవేదన రామారావుకి అర్థమైంది.

శీతాకాలం అయిదు గంటలకే చీకట్లు ముసురుతున్నాయి. సుబ్బలక్ష్మి లేచింది పిల్లలతో. రామారావు లేచాడు. వాళ్ళ అడుగులు ముందుకు పడుతున్నాయి.

గున్నమ్మ వెనక్కి దిగడిపోయింది-

దూరంగా - పైడమ్మ గట్టిగా అరుస్తోంది.

"ఒసే గున్నీ ఎక్కడ తగులడ్డావ్, దిగిరా !"

"మెట్ల మీద వచ్చేపోయే వాళ్ళని చూస్తూ కూర్చుంటే నాన్న కనిపిస్తాడంట. పిచ్చి మొహంది ఎప్పుడో వదిలేసి వెళ్ళిపోయినోడు ఇప్పుడు రావటానికి, దీన్ని సూడడానికి, యిదేమైనా సినిమా అనుకుంటోంది కాబోలు. తిండీ తిప్పలూ లేకుండా అక్కడే పడిచస్తోంది."

పైడమ్మ గొంతులో మాటలు గాలిలో తేలుతూ గున్నమ్మ గుండెల్ని దూసుకు పోతున్నాయ్.

( "స్వాతి" మాసపత్రిక నుండి )